యథార్థ దృశ్యాలు

# పండుగ రోజులు

మొవ్వ రాంబాబు

పట్టణంలో దేవీనవరాత్రి ఉత్సవాలూ, కన్యకా అమ్మవారి ఉత్సవాలూ బ్రహ్మాండంగా పది రోజులనుండీ జరుగుతూన్నాయి. ఊరు అంతా సందడిగా ఉంటున్నది. ముఖ్యంగా సాయంత్రం వేళ, అనేకమంది స్త్రీలు చక్కగా సింగారించుకొని ఆభరణాలన్నీ పెట్టుకుని వెంట ఒక ముసలమ్మ రాగా, ఇంటివద్ద మరొక ముసలమ్మను పెట్టి బయలుదేరి తండోప తండాలుగా వచ్చి అమ్మవారిని చూచి వెళుతున్నారు. వారిని చూడటానికి అనేకమంది మొగవారు ముఖ్యంగా కుర్రకారు, జట్లు జట్లుగా నిలబడి ఉన్నారు, వీధులకు రెండు వైపులా. విజయ దశమి చివరిరోజు వచ్చింది. ఊరేగింపు బ్రహ్మాండంగా బయలుదేరింది. శివాజీ మహారాజ్, రాణా ప్రతాప్, ఝాన్సీ లక్ష్మి, నేతాజీబోసు, మొదలైన వీరుల వేషాలు ముందు గుర్రముల మీద రాగా, వెనక రాధా కృష్ణుల వేషము, అయోధ్యా రాముని పట్టాభిషేక వేషము వస్తున్నాయి. అన్నిటి వెనుక ప్రశాంత వదనంతో అందరినీ ఆశీర్వదిస్తూన్నట్టు చిరునవ్వుతో భరతమాత వేషము చక్కని పూల పల్లకిలో కూర్చొని వస్తున్నది. స్పెషల్ డైనమో ఒకటి ఈ రథాల వెంబడి అమర్చి వీటన్నిటినీ, ప్రకాశవంతంగా అలంకరించారు. అనేక వందల రూపాయల మందు సామను కాలుస్తూన్నారు ఊరేగింపుకు ముందువుండి తానే నడుపుతున్నానని అనుకుంటున్నాడు వీరశివాజీ. అతనికి నిజంగా ఒక యుద్ధానికి బయలుదేరినట్లుగానే యున్నది. చివరనున్న భరతమాత వేషము వేసిన కుర్రాడు ఈ ఘనతంతా తనకేనన్నట్టు నవ్వుతూంటే పెదిమలకు వేసిన ఎర్ర రంగు మెరుస్తూంది. పట్టణ వర్తక శిరోమణులు, అనేకమంది పుర ప్రముఖులు వెంటరాగా పోతూనే ఉంది ఊరేగింపు. నేను ఊరేగింపులో ఒక పరమాణువుగా పోతున్నాను. మా స్నేహితుడు సుబ్బారావు కూడా ఉన్నాడు నాతో.

సుబ్బారావుది నాది ఒకే వూరు. వాడు పెద్ద బజారులో ఒక షావుకారివద్ద గుమాస్తా. నేను హైస్కూలులో చదువు కొరకు పట్టణం వచ్చాను. వాడు కొట్లలో గుమస్తాగిరి సంపాదనకు పట్టణం వచ్చాడు.

'ఏంరా సుబ్బారావు!' అన్నాను.

'ఏం రా'

'ఎట్లా ఉన్నవిరా ఉత్సవాలు'

'బాగానే ఉన్నాయ్'

'ఏం బాగారా!'

'బాగానే ఉన్నాయిరా' అని అన్నాడు నీరసంగా.

'ఒంట్లో బాగలేదటరా.'

'బాగానే ఉన్నదిరా' అని అన్నాడు.

'ఇవ్వాళ ఇంట్లో ఏమి చేసుకొన్నారురా మీరు.'

'నాకు తెలియదురా.'

'నీకు తెలియకపోవటం ఏమిటి?'

'తెలియకపోవటం ఏముందిరా! పండుగ జేరాలని షావుకారు సాయంత్రం మూడింటిదాక ఉంచాడు. అట్లా అట్లా చేసి ఇంటికి చేరుకునేటప్పటికి నాలుగు అయింది. ఇంటిఆవిడ అమ్మవారిని చూడటానికి, ఆలస్యమయితే ఒత్తిడి అవుతుందని నాలుగింటికే వెళ్ళింది. అన్నం పెట్టుకొని తినబోయేటప్పటికి వేళ తప్పింది. ఆకలి చచ్చిపోయింది. బజారుకు వచ్చి హోటల్‌లో కాఫీ త్రాగుదామని వస్తే సగం కాఫీ పారబోసుకుంటూనే వచ్చాడు హడావడిలో. దేవ దర్శించుకోవాలిసి వచ్చింది' అని అన్నాడు.

ఇంతలో ఊరేగింపు ఒక పెద్ద మేడముందు కొద్ది నిముషాలు ఆగి మరల బయలుదేరింది.

'అరే ఆ అద్దాల మేడ ఎవరిదిరా.'

'నీకు తెలియకుండానే అడుగుతున్నావటరా' అని అన్నాడు.

'నిజంగా తెలియదురా.'

'మా షావుకారుది' అన్నాడు.

'అతన్ని గురించి ఏమని చెప్పుకుంటున్నారురా.'

'బిస్కి కోటా అంతా, రెడీమేడ్ దుస్తులు చేయించి అమ్ముకుంటున్నాడని చెప్పుకుంటున్నారురా.'

'నిజమేనా అదంతా.'

'నిజమే. మెట్టూరు లాంగ్‌క్లాత్ కూడా కాజేశాడురా' అని అన్నాడు.

ఊరేగింపు పోతూనేఉంది కోలాహలంగా. ముందువాళ్ళను తోసుకుంటూ వెనకవాళ్ళు, తమరోడ్లకు చీలిపోయేవాళ్ళు కొందరు, ప్రక్కరోడ్లనుండి వచ్చి కలిసేవాళ్ళు కొంతమంది, అంతకంతకూ జనం ఎక్కువవుతున్నారేగాని తగ్గడంలేదు. అందరికన్నా ముందున్నవాళ్ళు ముందుగుండు సామాన్లు కాలుస్తున్నారు. మామూలు అవ్వాయి చువ్వలు, చిచ్చుబుడ్లు కాకుండా 'ఆటంబాంబు'లు ఇంకా అనేక రకాలైన ప్రేలుడు పదార్థాలు, పెద్ద మోతపుట్టించేవి కాలుస్తున్నారు. వారికి వెనకవరుసలో కాషాయిరంగు జండాలవాళ్ళు 'శివాజీ మహరాజ్ జిందాబాద్' 'రాణాప్రతాప్ జిందాబాద్' 'ఝాన్సీలక్ష్మి జిందాబాద్' 'నేతాజీ బాబు జిందాబాద్' అని చేసే నినాదాలు మిన్నుముట్టుతున్నాయి. ఒకొక్కడు ఆవేశం పట్టలేక 'హిందూ హిందూ' అంటుంటే 'ఏక్ హో' అని ప్రతిధ్వనిస్తూంది. ఇంతలో ఒక కారు ఆదారిని చీల్చుకుంటూ కష్టంమీద ఊరేగింపు మధ్యగా వెళ్ళింది. ఇంతమంది జనాన్ని చీల్చుకుంటూ వెళ్ళకపోతే ఇంకోదారిని పోగూడదా అని అనిపించింది.

'ఒరే సుబ్బారావు ఆ కారు ఎవరిదిరా' అడిగాను.

'మా షావుకారి అబ్బాయిది.'

'ఎప్పుడు కొనుక్కున్నాడురా!'

'నేను మా అబ్బాయికి డమడమాల బండిని కొనిపెట్టినప్పుడు.'

'అంటే షావుకారుగారు మీ అబ్బాయి డమడమాల బండీ చూచి వాళ్ల అబ్బాయికి కారు కొనిపెట్టాడంటావు?'

'అది కాదురా. షావుకారుగారు వాళ్ళ అబ్బాయికి కారు తెప్పించి ఇస్తే నేను మా వాడికి డమడమాలబండి కొని పెట్టానురా. షావుకారుగారు పధ్నాలుగువేలు ఖర్చుపెట్టితే నేను పావలా ఖర్చుపెట్టాను అదీ.'

ఊరేగింపు పోతూనేవుంది. రోడ్డుపక్కన మసీదు ఒకటి వచ్చింది. దాంతో 'హిందూ హిందూ ఏక్ హో' 'హిందూహిందూ ఏక్ హో' నాదాలు మరింత తీవ్రమైనాయి. వీరశివాజీ నిజంగా యుద్ధంలోకి దిగినవాడికిమల్లే కత్తి మరీ పైకెత్తాడు. వీర రాణాప్రతాప్ ఖడ్గాన్ని పైకెత్తి దగ్గరకువస్తే చాలు నరకబోయేవాడికి మల్లే ఉన్నాడు, ఉగ్రస్వరూపంతో. మసీదుకు ఎదురుగ్గా బిచాణావేశారు. మహారుద్రుడు ఒక చేతిలో ఢక్క, రెండవచేతిలో త్రిశూలము ఒంటికెండా తెల్లటిరంగు ఇంకా అనేకరకాలుగా నిర్ణింప నలవికాకుండా ఉన్నాడు. సాంబ్రాణి పొగ తీవ్రంగా వేస్తూంది. రుద్రుడు కాళరుద్రునివలె విజృంభించి నృత్యం (చిందులు) చేస్తున్నాడు అతడికి వెనకవైపు ఒకడు విసురుతున్నాడు. రంగులు వేసుకుంటే ఒళ్ళు వెళ్ళిపోతుందట. వాళ్ళకు వెనక కోయరాజు, కోయపెట్ట చిందులు త్రొక్కుతున్నారు. కోయరాజు హుంకరిస్తూ మాలవాడి డప్పుతో లయ గలుపుతూ పెట్టవంక చూస్తున్నాడు. పెట్ట సరసంగా రాజుకు చిక్కకుండా చిందులు త్రొక్కుతూంది. అసలు వీళ్ళందరికీ ముందు సాము వస్తాదులు తమ దుకాణం తెరిచారు. ఒకజట్టు అయిపోయిన తరువాత మరొకజట్టు కఱ్ఱలు తిప్పుతున్నారు. కఱ్ఱలు టకటకా మ్రోగినప్పుడు, జనంవేసే ఈలలతో వాళ్ళకు మరీ ఉషారు ఎక్కుతూంది. ఊరేగింపు మళ్ళా బయలుదేరింది.

'ఒరేయ్' అన్నాడు సుబ్బారావు నన్ను.

'ఏమిటిరా'

'ఎందుకురా వాళ్ల హిందూ హిందూ ఏక్ హో అనటం.'

'సాయిబులకి తమ ప్రతాపాన్ని చూపటానికిరా.'

'గుఱ్ఱపుబళ్ళ సాయిబుల కటరా?'

'కాదురా.'

'లాగుడుబళ్ళ సాయిబులకా?'

'కాదురా.'

'మరి మిషను సాయిబుల కటరా అయితే?'

'కాదురా.'

'మరి ఎవరికిరా వాళ్ళు ప్రతాపాన్ని చూపటం?' అని అన్నాడు.

'అందరికీరా. సాయిబు లందరికీ.'

'వాళ్ళ కెందుకురా తమ ప్రతాపాన్ని చూపటం?'

'బీదవాళ్ళమీద అలుసురా' అన్నాను నేను.

'మరి నేనూ బీదవాడినే గదా నామీద చూపించటం లేదే? నేను' మాట్లాడలేదు.

ఊరేగింపు పోతూనేవుంది. ఊరేగింపు రెండు మైళ్ళు వచ్చినట్టుంది. సుబ్బారావు నడవలేకుండా ఉన్నాడు'

'ఒరేయ్ ఆకలివేస్తూందిరా, నామీద ఆకలి తీసుకుంటున్నదిరా తన అలుసుని' అని అన్నాడు.

'మా ఇంటికి వెళదాము పద.'

'అక్కడికి దేనికిరా! మాయింట్లో పండగ చేసుకోలేదు' అని అన్నాడు సుబ్బారావు నెమ్మదిగా.

ఐతే వాడు ఇందాక చెప్పినదంతా అబద్ధం.

'మరి మీ ఇంట్లో పండుగ చేసుకోలేదూ, నాకు అసలు ఇల్లేలేదు' అన్నాను నేను.

'ఇందాక అన్నం తిందామని వెళ్ళానురా ఏమన్నా పెసింద్దేమో నని ఆశతో. అక్కడ ఉంటేగా ఏమన్నా చేయటానికి. మాషావుకారు ప్రొద్దున్నే రమ్మన మంటే నేను పోతిని. తొమ్మిదింటికి వచ్చి ఇంట్లో ఏమన్నా ఇచ్చిపోదామనుకుంటే షావుకారు విడచిపెట్టలేదు. సాయంత్రం వచ్చేటప్పటికి షావుకారు లేడు ఏమయినా డబ్బులు అడగు దామంటే. షావుకారి కొడుకు వాళ్ళ నాన్న చెప్పనిదే ఇవ్వటానికి వీలు లేదన్నాడు. ఖర్మకాలితే చివరకు పండగపూట ఉపవాసం అయిందిరా.'

సుబ్బారావుకి ప్రొద్దుటినుండీ అన్నంలేదు. పైగా సాయంత్రము వరకు తగనిరుని. మనిషి నీరసించి పోయాడు. తప్పటడుగులు వేసుకుంటూ వస్తున్నాడు.

ఓరే బాబూ ఆకలివేస్తూందిరా'

'నన్నేమి చేయమంటావురా?'

'ఊరేగింపు వాళ్ళు ఏమయినా పెడతారటరా. ఒక్క అవ్వాయి చువ్వ కాల్చినంతైనా ఉండదు'

'శాద్ధం'

వాడు మాట్లాడలేదు. నడవలేక, నా ఆధారంతో వస్తున్నాడు. కొంచెం సేపుఆగి 'మా షావుకారు వస్తున్నాడేమో చూడరా' అని అన్నాడు.

'ఎందుకురా'

'నా చేత ఉత్సవానికి బలవంతముగా రూపాయి చందా జీతంలోంచి తీసి ఇచ్చాడురా'

నాకు ఆశ్చర్యం వేసింది. సుబ్బారావు లాంటి చిన్న గుమాస్తా చేత రూపాయి చందా వేయించా డనేటప్పటికి! 'కనిపిస్తే నా రూపాయి ఇవ్వమని అడుగుతాను. తిండిలేక చస్తున్నాను ఇవ్వమంటాను. ప్రొద్దుటినుండి అన్నం లేక చస్తూంటే, నా రూపాయి ఖర్చుపెట్టి లాగుడు బళ్ళ సాయిబులమీద పరాక్రమం చూపించ వద్దంటాను. నా రూపాయి ఖర్చుపెట్టి [illegible] వేయించ వద్దంటాను. నేను తిండిలేక చస్తుంటే నా రూపాయి ఖర్చుపెట్టి 'ఆటంబాంబులు' కాల్చ వద్దంటాను' అని అంటూన్నాడు సుబ్బారావు. గొంతు స్వరం తప్పిపోతూంది. తూలిపోతున్నాడు. 'సుబ్బారావు! సుబ్బారావు' అంటు వాడిని ఊపాను. దగ్గరలోనే పంపులో మంచినీరు త్రాగించి ఇంక నడవటం మంచిది కాదనుకొని నా రూముకి దారి పట్టించాను.




కొద్ది దూరంనుంచి ప్రేలుడు ప్రమోత వినబడుతూనే ఉంది. అవ్వాయి చువ్వలు పైకి ఎగసి కొద్ది క్షణాలు రంగులు రంగులుగా మెరిసి ఆరిపోతూన్నాయి. సుబ్బారావు వాళ్ళ షావుకారులాంటి పెత్తనదారులు అనేకమంది రథాల వెంట పోతూ వున్నారు. ఊరేగింపు సాగిపోతూనే ఉన్నది.

'మా షావుకారు కనబడితే హోల్ సేల్ కొట్టులో వచ్చిన లక్ష రూపాయల లంచాలు ఖర్చుపెట్టమను గాని నా రూపాయి ఖర్చుపెట్టి నన్ను చంపవద్దనరోయ్' అని అంటూనే నా రూము అరుగుమీద కూలబడ్డాడు గుమాస్తా సుబ్బారావు.

నా పెట్టె అంతా వెతికితే ఒక్క రూపాయి కనబడింది. అడగ్గర సినిమాహాలు దగ్గర టీస్టాలులో కాఫీ తెచ్చిపెట్టాను. కొద్దిగా తెప్పరిల్లుకున్నాడు. తరువాత నెమ్మదిగా మాటలలో పూర్తి అయింది సుబ్బారావుకి ఆ పూట

భోజనానికి మా యింటికి తీసుకు వెళ్ళేవాడినే గాని నాకు ఇల్లు అంటూ లేదు. మా మామయ్యగారి యింట్లో భోజనం చేయటం ఇక్కడ ఒక గదిలో ఉండి చదువుకోవటం. నేను భోజనం చేయటమే బహు కష్టంగా ఉండేది. మా నాన్న అప్పుడప్పుడూ వచ్చి అస్తుబిస్తుగా ఇస్తుంటాడు డబ్బు ఖర్చులకి. ఇటువంటి పరిస్థితులలో ఏవిధంగానూ సహాయం చేయలేకుండా ఏర్పడ్డాను సుబ్బారావుకి. ప్రొద్దుటినుండీ పని చేయించుకొన్న వాళ్ళ షావుకారా, సాయిబులమీద దండయాత్ర) చేయబోతున్నాడు. సుబ్బారావు శ్రమను కాజేస్తూ, డబ్బులు ఇవ్వకుండా సుబ్బారావుమీద దండయాత్ర చేస్తున్నాడు.

మరి తమతోటి హిందూవే! హిందూ హిందూ ఏక్ హో అని అంటున్నారే! మరి సుబ్బారావుకి జరిగిన ఈ పై అన్యాయంనుండి రక్షించటానికి ఒక్క హిందువు ముందుకు వస్తాడా అని నేను ప్రశ్నిస్తాను. దానికి జవాబుకోసం నిరీక్షిస్తాను. ఊరేగింపు తిరిగి వస్తూంది. భారతమాతను ఉద్దేశించి నాలో నేను ప్రశ్నించుకున్నాను. ఆ ప్రశ్న నాలోనే ప్రతిధ్వనించింది గాని దాని జవాబు మాత్రం రాలేదు.

ఆరాత్రి వాళ్ళ ఇంటివద్ద దిగవిడిచి వచ్చాను సుబ్బారావుని. వచ్చిన చిక్కు ఏమిటంటే వేషాలు వేసినవాళ్ళు అంతా సాహూ సుబ్బారావుకి స్నేహితులే. అందులో అయోధ్యారాముని పట్టాభిషేకములో హనుమంతుడి అవతారం వేసి తోక విసురుకుంటున్నవాడు మా క్లాసువాడు.

'ఏమిరా' అన్నాను.

'ఏమిటిరా' అన్నాడు.

'నీవు కోతివిరా.'

'కాదు మనిషినిరా.'

'కాదు కాదు. నీవు కోతివే' అన్నాను రెట్టిస్తూ.

'నిన్న హనుమంతుడి వేషం వేసినంత మాత్రాన నేను మనిషిని కాకపోయానా.' అని అన్నాడు నవ్వుతూ మిత్రుడు.

'అయితే మనిషిగానే ఉండే కోతివేషాలు ఎట్లా వేస్తావురా?'

'నీ మొహం. అరవకు.'

'అయితే నీకూ కోతికి తేడాలు ఏమిటో చెప్పరా.'

'బజారులో గోల చెయ్యకురా' అన్నాడు.

'అయితే నిన్నటికీ ఇవ్వాళటికి తేడా ఏమిటి?'

'ఏమో' అన్నాడు.

వానికి ఇంకా కోపం తెప్పించాలనే,

'నిన్న అయోధ్యా రాముడు ఏమన్నా మంత్రోపదేశం గాని, వరాలు గాని, ఇచ్చాడటరా' అన్నాను.

'ఒరేయ్! నిన్ను ఒక తన్ను తన్నానంటే పోయి మీ బాబు వడిలో పడతావు' అన్నాడు.

చచ్చిపోయిన మా తాతను చూడాలని ఉందిరా. అక్కడకు పంపించరా' అన్నాను నవ్వుతూ.

'నువ్వు తొందరలోనే అక్కడకు చేరుకునేటట్టు ఉన్నావు' అన్నాడు.

'మా తాతను చూడాలని చాలా రోజుల నుండీ కోరిక ఉన్నదిగాని, మీరామరాజ్యం విడచి పో బుద్ధి పుట్టడం లేదురా'

'పో వెధవా! నువ్వు కమ్యూనిస్టువవుతున్నావు నిన్ను ఎప్పుడో పోలీసువాళ్లు మూస్తారు. అప్పుడు వదులుతుంది ఈ పైత్యం కాస్తా' అని అంటూనే అక్కడనుండి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపోయి వాడివంకే చూస్తున్నాను.